సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం ; 5 ; మార్చి ; 2024



చీనీ టన్ను రూ.18 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు. కనిష్టంగా రూ.8 వేల ప్రకారం ధర పలికాయి.



శిల్పకళల కాణాచి లేపాక్షి
ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన లేపాక్షిలో ఈ నెల 7వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

8లో

గరిష్టం/కనిష్టం
38.2°/ 17.9°

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. పలు చోట్ల వేకువజామున చలి వాతావరణం నెలకొంది. గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో తూర్పు దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

పోలింగ్ కేంద్రాల్లో వసతులన్నీ కల్పించాలి



హుస్సేన్‌పురం పోలింగ్ కేంద్రంలో వసతులు పరిశీలిస్తున్న జేసీ అభిషేక్ కుమార్

చిలమత్తూరు: పోలింగ్ కేంద్రాల్లో వసతులన్నీ కల్పించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన మండలంలోని వీరాపురం పంచాయతీలోని పలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. తొలుత వెంకటాపురం, అనంతరం హుస్సేన్‌పురం పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి, సౌకర్యాలపై ఆరా తీశారు. ఎక్కడైనా వసతుల కల్పనలో ఇబ్బందులుంటే తనకు తెలియజేయాలన్నారు. ముఖ్యంగా దివ్యాంగులకు ఇబ్బందులు కలగకుండా ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఆయన వీరాపురం , వెంకటాపురం గ్రామాల్లో పర్యటించారు. సైబీరియన్ పక్షులను తిలకించి వాటి ఆహార మార్గాల గురించి ఆరా తీశారు. తీసుకోవాల్సిన చర్యల గురించి స్థానిక అధికారులతో చర్చించారు. జేసీ వెంట డీటీ యూనిస్, వీఆర్‌ఓ ప్రవీణ్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

'సెబ్' జిల్లా అధికారిగా నాగభూషణం



ఎస్పీ మాధవరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాగభూషణం

పుట్టపర్తి టౌన్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) జిల్లా అధికారిగా నాగభూషణం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ ఇంటలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న ఆయన్ను, ప్రభుత్వం ఇటీవలే జిల్లాకు బదిలీ చేసింది. దీంతో సోమవారం ఆయన బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయానికి వెళ్లి ఎస్పీ మాధవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సెబ్ జిల్లా అధికారి నాగభూషణం మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం, రవాణాపై దృష్టి సారిస్తామన్నారు. అక్రమ మద్యం నిల్వలు, రవాణాకు అడ్డుకట్ట వేస్తామన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్ష



అమడగూరులో పరీక్షలు రాసి బయటకు వస్తున్న బాలికలు

పుట్టపర్తి: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన మొదటి సంవత్సరం ఇంగ్లిష్ పేపర్–1 పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా సాగింది. జిల్లాలోని 41 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా, 424 మంది గైర్హాజరయ్యారు. జనరల్‌కు సంబంధించి 10,866 మందికి గాను 10,543 మంది హాజరయ్యారు. 323 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 1,662 మంది విద్యార్థులకు గాను 1,561 మంది హాజరయ్యారు. 101 మంది గైర్హాజరయ్యారని ఇంటర్మీడియెట్ విద్య అధికారి రఘునాథరెడ్డి తెలిపారు.

చింతపండు @ రూ.24 వేలు



మార్కెట్‌కు వచ్చిన చింతపండు

హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో క్వింటా చింతపండు గరిష్టంగా రూ.24 వేలు పలికింది. సోమవరం మార్కెట్‌కు 2,597 క్వింటాళ్ల చింతపండు రాగా, ఈ–నామ్‌లో వేలం వేసినట్లు కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. అందులో కరిపులి రకం (ప్రథమశ్రేణి) క్వింటా గరిష్టంగా రూ.24 వేలు, కనిష్టంగా రూ.8,100, సగటున రూ.10 వేల ప్రకారం పలికిందన్నారు. అలాగే ఫ్లవర్ రకం చింతపండు క్వింటా గరిష్టంగా రూ.11 వేలు, కనిష్ఠంగా రూ.4,050, సగటున రూ.5,500 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి. అలాగే బోటు రకం చింతపండు క్వింటా రూ.2,500 నుంచి రూ.3 వేల మధ్య క్రయవిక్రయాలు సాగినట్లు మార్కెట్ కార్యదర్శి వెల్లడించారు.

కదలి..రాని జనం

- జన సమీకరణకు 'తమ్ముళ్ల' తంటాలు
- జనస్పందన లేకపోవడంతో బాబు ఆగ్రహం
- మద్యం ఎరగా వేసేందుకు ముందుగా స్కెచ్
- హిందూపురంలో మద్యంతో పట్టుబడిన 'తమ్ముళ్లు'
- సభలో బీకేను పక్కనబెట్టి అన్నీ తానై వ్యవహరించిన సవిత



చంద్రబాబు సభలో ఖాళీగా కనిపించిన కుర్చీలు

సాక్షి, పుట్టపర్తి : రా...కదలిరా అంటూ వారం రోజులుగా ఊరూవాడా ఊదరగొట్టినా.. జనం మాత్రం పట్టించుకోలేదు. సభాస్థలాన్ని రాప్తాడు నుంచి పెనుకొండకు మార్చినా ప్రజలు పెద్దగా ఆసక్తి చూపలేదు. చివరకూ తమ్ముళ్లు రాలేం బాబూ అంటూ ముఖం చాటేశారు. ఫలితంగా టీడీపీ పెనుకొండలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'రా..కదలిరా' సభ వెలవెలబోయింది. చంద్రబాబు ముఖం వాడిపోయింది.

మద్యం ఎరగా వేసేందుకు ప్రయత్నించి..
పెనుకొండ సభను ఎలాగైనా విజయవంతం చేయాలని, భారీగా జన సమీకరణ చేయాలని ఏకంగా చంద్రబాబే ఆదేశించడంతో టీడీపీ నాయకులు ఎవరికి వారు ముమ్మర ప్రయత్నాలు చేశారు. కానీ ఎక్కడా స్పందన కనిపించలేదు. దీంతో మద్యం ఎరగా వేసి జనాలను తరలించాలని భావించారు. అయితే ఆదివారం సాయంత్రం నుంచి సరిహద్దులో పోలీసులు మోహరించడంతో అందులోనూ విఫలమయ్యారు. పోలీసుల కళ్లుకప్పి మద్యం తరలించాలని చూసిన టీడీపీ కార్యకర్తలను సరిహద్దులోనే హిందూపురం 'సెబ్' పోలీసులు అదుపులోకి తీసుకుని రూ.2.34 లక్షలు విలువ చేసే కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. దీంతో సోమవారం నాటి సభలో అన్నీ ఖాళీ కుర్చీలే కనిపించగా, నేతలపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

అన్నీ తానై వ్యవహరించిన సవిత..
సభలో పెనుకొండ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి సవిత అన్నీ తానై వ్యవహరించారు. దీంతో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి వర్గీయులు ఏర్పాట్లకు దూరంగా ఉంటూ వచ్చారు. టికెట్ సంగతి పక్కనబెడితే.. జిల్లా అధ్యక్షుడికే అవమానం చేశారంటూ సవితపై విమర్శలు చేయడం గమనార్హం. పరిటాల శ్రీరామ్‌కు టికెట్ సస్పెన్స్‌లో ఉండటంతో.. వస్తుందేమో అనే ఆశతో ఆయన అత్యుత్సాహం ప్రదర్శించారు. ఇందులో భాగంగానే బత్తలపల్లిలో హంగామా చేశారని తెలిసింది.

మధ్యలోనే వెనుదిరిగిన జనం..
చంద్రబాబు ప్రసంగం మొదలుపెట్టిన కాసేపటికే జనాలు వెనుదిరిగారు. అయినా ఆయన ప్రసంగం కొనసాగించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలపై విమర్శలు.. ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూ ప్రసంగించారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ సభలోనూ జిల్లా నేతలు ఎవరికి వారుగా వ్యవహరించారు. అభ్యర్థుల తొలి జాబితాలో పేర్లు లేని వారంతా నిరుత్సాహంతో కనిపించారు.

రాలేమన్న తెలుగు తమ్ముళ్లు
రా.. కదలిరా సభలో జనాల కంటే నాయకులే ఎక్కువగా కనిపించారు. ప్రతి నియోజకవర్గం నుంచి పార్టీ పదవుల్లో కొనసాగుతున్న నాయకులు మాత్రమే వచ్చారు. ప్రజలు ఎక్కడా కనిపించలేదు. మడకశిరలో గుండుమల తిప్పేస్వామి వర్గం, పెనుకొండలో బీకే పార్థసారథి వర్గం సభలో కనిపించలేదు. దీంతో కుర్చీలన్నీ ఖాళీగా కనిపించాయి. కెమెరాలు కూడా ముందున్న రెండు బారికేడ్లు దాటి వెళ్లలేదు.

గుండుమల వర్గం దుమ్మా..
మడకశిర: పెనుకొండలో సోమవారం టీడీపీ నిర్వహించిన 'రా కదలిరా' సభకు మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుండుమల తిప్పేస్వామి వర్గీయులు మూకుమ్మడిగా డుమ్మా కొట్టారు. గుండుమల తిప్పేస్వామి ఒక్కరే సభలో పాల్గొన్నారు. ముఖ్యంగా నియోజకవర్గంలోని 5 మండలాలకు చెందిన మండల కన్వీనర్లు, రాష్ట్ర, జిల్లా, మండల కమిటీల సభ్యులు, పార్టీ ఇతర విభాగాల నాయకులెవరూ ఈ సభకు వెళ్లలేదు. మాజీ ఎమ్మెల్యే ఈరన్న, టీడీపీ అభ్యర్థి సునీల్‌కుమార్ వర్గీయులు మాత్రం సభకు వెళ్లారు.

అభ్యర్థి మార్పు ఖాయమని అభయం..
నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలతో గుండుమల తిప్పేస్వామి సోమవారం తన స్వగృహంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. అభ్యర్థి మార్పు తప్పకుండా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని కార్యకర్తలను తెలిపారు. ఇదిలా ఉండగా మంగళవారం మడకశిరలో సునీల్‌వద్దు....చంద్రబాబు ముద్దు అంటూ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు ర్యాలీ నిర్వహించనున్నట్లు సమాచారం.

పరిటాల వర్గీయుల వీరంగం



పరిటాల వర్గీయుల దాడిలో ధ్వంసమైన వాహనాల అద్దాలు

- బత్తలపల్లిలో రణరంగం
- వరదాపురం వర్గీయులతో ఘర్షణ
- 30 వాహనాల ధ్వంసం

బత్తలపల్లి: మండల కేంద్రంలో సోమవారం ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ వర్గీయులు రెచ్చిపోయారు. ధర్మవరం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత గోనుగుంట్ల సూర్యనారాయణ (వరదాపురం సూరి) వర్గీయులతో బాహాబాహీకి దిగారు. సూరి వర్గీయులకు చెందిన 28 వాహనాల అద్దాలు పగులగొట్టారు. వారు కూడా ప్రతి దాడులకు దిగి పరిటాల వర్గీయులకు చెందిన రెండు వాహనాల అద్దాలు ధ్వంసం చేశారు. ఈ ఘర్షణ కారణంగా సుమారు మూడు గంటల పాటు తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. సోమవారం టీడీపీ అధినేత చంద్రబాబు ఆధ్వర్యంలో పెనుకొండ సమీపంలో 'రా–కదలిరా' బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు జనాన్ని తరలించి చంద్రబాబు వద్ద బల ప్రదర్శన చేసేందుకు ఆ పార్టీ టికెట్ ఆశిస్తున్న వరదాపురం సూరి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఇరువురూ పోటాపోటీగా వాహనాలను ఏర్పాటు చేశారు. పెనుకొండకు బత్తలపల్లి మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది. ఇక్కడ టీడీపీ కార్యాలయం ధర్మవరం రోడ్డుకు ఉంది. బత్తలపల్లి, తాడిమర్రి మండలాల నుంచి వరదాపురం ఏర్పాటు చేసిన వాహనాలు సాఫీగా వెళ్లిపోయాయి. ఇంతలోనే ముదిగుబ్బ మండలం నుంచి ఆయన వర్గీయుల వాహనాలు వచ్చాయి. పార్టీ కార్యాలయం వద్దకు రాగానే మండలానికి చెందిన గోనుగుంట్ల జయక్రిష్ణ అనే వ్యక్తి 'కాబోయే ఎమ్మెల్యే వరదాపురం సూరి' అంటూ నినాదాలు చేశాడు. దీంతో పార్టీ కార్యాలయంలో ఉన్న పరిటాల శ్రీరామ్ వర్గీయులు వారిపైన మట్టి, రాళ్లు విసిరారు. అలాగే వరదాపురం వర్గీయుల వాహనాలను అడ్డుకుని, అద్దాలను ధ్వంసం చేశారు. 28 వాహనాల అద్దాలు పగులగొట్టారు. దీంతో వాహనాల్లో నుంచి దిగిన సూరి వర్గీయులు స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ప్రతీకార దాడులకు ప్రయత్నించారు. ఒకానొక సమయంలో టీడీపీ కార్యాలయం వద్ద గుమికూడిన పరిటాల వర్గీయులతో తలపడడానికి ఈలలు వేస్తూ దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే పోలీసులు వారి చర్యలను సాగనీయలేదు. దీంతో రోడ్డుపై బైఠాయించి పరిటాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇదే సమయంలో పరిటాల వర్గీయుల వాహనాలు రావడంతో సూరి వర్గీయులు చుట్టుముట్టి రెండు వాహనాల అద్దాలు పగులగొట్టారు. ఇంతలో ముదిగుబ్బ సీఐ యతీంద్ర అక్కడికి చేరుకుని.. వారితో చర్చించి పక్కకు తీసుకువెళ్లారు. ధర్మవరం సీఐ సుబ్రమణ్యం కూడా తమ సిబ్బందితో రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కాగా..పరస్పర దాడుల్లో గరిశలపల్లి సురేంద్ర, వెంకటగారిపల్లి ప్రశాంత్‌తో పాటు మరో నలుగురు కార్యకర్తలకు గాయాలయ్యాయి. కొందరు ప్రయాణికులు, ప్రజలు సైతం స్వల్పంగా గాయపడ్డారు.

భయంతో వణికిపోయిన స్థానికులు
ఘర్షణ నేపథ్యంలో బత్తలపల్లి నాలుగు రోడ్ల కూడలి నుంచి టీడీపీ కార్యాలయం వరకు వాహనాలు రోడ్డుపైనే నిలిచిపోయాయి. పరిటాల శ్రీరామ్ వర్గీయులు రాళ్లు తీసుకుని అడ్డొచ్చిన వాహనాల అద్దాలను వరుసగా ధ్వంసం చేసుకుంటూ వచ్చారు. వాహనాల్లో ఉన్న వారికి ఏమి జరుగుతోందో అర్థం కాక తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వాహనాల్లో నుంచి దిగి పరుగులు తీశారు. స్థానికులు కూడా తమ దుకాణాలను బంద్ చేసుకున్నారు. టీడీపీ కార్యాలయ సమీపంలో రెండు బ్యాంకులు ఉండడంతో బ్యాంకుకు వచ్చిన వారు ఇబ్బందులు పడ్డారు. మార్కెట్టుకు పూలను తీసుకొచ్చిన రైతులు, ప్రయాణికులు, ప్రయివేట్, ప్రభుత్వ వాహనాల డ్రైవర్లు సైతం భయంతో వణికిపోయారు. స్థానిక ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రంలోకి ఇరువర్గాల వారు దూసుకురావడంతో వైద్యసిబ్బంది భయంతో వణికిపోతూ తలోదిక్కుకు పరుగుపెట్టారు. ఈ క్రమంలో ఆశా వర్కర్ మాధవికి బీపీ డౌన్ అయ్యి సొమ్మసిల్లి పడిపోయింది. స్థానికులు వెంటనే వైద్యశాలకు తరలించారు. తర్వాత ఆమె పరిస్థితి కుదుటపడింది. గత ఐదేళ్లుగా ప్రశాంతంగా ఉన్న బత్తలపల్లిలో పరిటాల, వరదాపురం వర్గీయుల కారణంగా ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఇప్పుడే ఇలాంటి పరిస్థితి ఉంటే రేపు ఎలాంటి పరిస్థితులు వస్తాయోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.



పరిటాల వర్గీయులను నియంత్రిస్తున్న పోలీసులు



ఘర్షణ కారణంగా భయాందోళనకు గురై సొమ్మసిల్లి పడిపోయిన ఆశా వర్కర్ మాధవి

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

- అధికారులకు జేసీ అభిషేక్‌కుమార్ ఆదేశం
- 'స్పందన'కు 187 అర్జీలు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే 'స్పందన', 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాల్లో అందే అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఆదేశించారు. సోమవారం ఆయన.. డీఆర్‌ఓ కొండయ్య, పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, గ్రామ/వార్డు సచివాలయాల జిల్లా నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, డీపీఓ విజయ్‌కుమార్ తదితరులతో కలెక్టరేట్‌లో నిర్వహించిన 'స్పందన'లో కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ సమస్యపై ప్రజల నుంచి 187 అర్జీలు అందగా, వాటి పరిష్కారానికి ఆయా శాఖలకు పంపారు. అనంతరం జేసీ మాట్లాడుతూ... ప్రతి అర్జీనీ క్షేత్రస్థాయిలో పరిశీలించి పారదర్శకంగా విచారణ జరిపి పరిష్కరించాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందితే మళ్లీ స్పందనకు వచ్చే అవకాశం ఉండదన్నారు. అందువల్ల అధికారులంతా ఈ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్రనాయక్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణ, పట్టు పరిశ్రమ శాఖ అధికారి పద్మమ్మ, జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, సీపీఓ విజయ్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారులు శివరంగప్రసాద్, మోహన్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలలో కొన్ని ఇలా...

- తాను కుష్టు బాధితుడినని, రెండు చేతులకూ వేళ్లు లేకపోవడంతో ప్రతి నెలా చౌకదుకాణం నుంచి బియ్యం, నిత్యావసరాలు తీసుకోలేక పోతున్నానని కొత్తచెరువు మండలం మామిళ్లకుంట క్రాస్‌కు చెందిన ఓబుళమ్మ జేసీకి ఫిర్యాదు చేశారు. వేలిముద్ర కాకుండా ఇతర మార్గాల ద్వారా బియ్యం అందేలా చూడాలని విన్నవించారు.
- 500కుపైగా ఓటర్లు ఉన్న మామిళ్లకుంట క్రాస్‌లో ఓ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పలువురు వృద్ధులు, ఎస్సీలు జేసీకి విన్నవించారు. స్థానికంగా పోలింగ్ కేంద్రం లేక తామంతా ఒకటిన్నర కిలోమీటర్ దూరంలోని కొత్తచెరువు మండలం గుంటిపల్లికి వెళ్లాల్సి వస్తోందన్నారు. అందువల్ల మామిళ్లకుంట క్రాస్‌లోని పాఠశాలలోనే పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తే అందరికీ అనుకూలంగా ఉంటుందన్నారు.
- ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో తన తోటలోని మామిడిచెట్లు, డ్రిప్పు పరికరాలు పూర్తిగా కాలిపోయాయని, పరిహారం ఇప్పించాలని కొత్తచెరువుకు చెందిన రామాంజనేయులు జేసీని కోరారు. సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందన్నారు.
- ఓడీచెరువు అల్లాపల్లి గ్రామంలో నిర్మించుకున్న ఇల్లు సగానికిపైగా రోడ్డు విస్తరణలో కోల్పోయానని, పరిహారం ఇప్పించి ఆదుకోవాలని గ్రామానికి చెందిన వరలక్ష్మి జేసీకి విన్నవించారు. తనకు మరోచోట ఇంటి పట్టా ఇప్పించాలని కోరారు.

కదిరికి జలకళ..

- చెరువులన్నింటికీ కృష్ణా జలాలు
- హంద్రీ–నీవా మెయిన్ కెనాల్‌కు నీటి విడుదల
- నిండుకుండను తలపిస్తున్న చెర్లోపల్లి రిజర్వాయర్
- సస్యశ్యామలం అవుతున్న కదిరి నియోజకవర్గం

ఒకప్పుడు నీటి కోసం కటకటలాడిన కదిరి ప్రాంతంలో నేడు కృష్ణమ్మ పరవళ్లతో జల సవ్వడులు వినిపిస్తున్నాయి. హంద్రీ–నీవా ద్వారా కృష్ణమ్మ పరుగులు తీస్తుండగా.. రైతన్న ఇంట సంతోషాలు నెలకొన్నాయి. చెర్లోపల్లి రిజర్వాయర్ ప్రస్తుతం నిండుకుండను తలపిస్తుండగా, కదిరి ప్రాంత ప్రజలకు ఇచ్చిన మాటను సీఎం జగన్ నిలబెట్టుకున్నారని జనమంతా అభినందిస్తున్నారు.




కాలువలో పరవళ్లు తొక్కుతున్న కృష్ణా జలాలు

కదిరి: జీడిపల్లి రిజర్వాయర్ నుంచి వచ్చే హంద్రీ–నీవా కాలువ ముదిగుబ్బ మండలం నాగారెడ్డిపల్లి వద్ద రెండుగా విడిపోతుంది. ఎడమవైపు మెయిన్ కెనాల్ వెళుతుంది. కుడివైపు నుంచి పుంగనూరు బ్రాంచ్ కెనాల్ మొదలవుతుంది. 2019 ఎన్నికలకు మునుపు అప్పటి సీఎం చంద్రబాబు మెయిన్ కెనాల్ ద్వారా కుప్పానికి కృష్ణా జలాలు తరలించాలని చూశారు. అయితే తలుపుల మండలం ఓదులపల్లి వద్ద ఉన్న హంద్రీ–నీవా సొరంగ మార్గం (టన్నెల్) పనులు పెండింగ్‌లో ఉండటంతో సాధ్యం కాలేదు. దీంతో పుంగనూరు బ్రాంచ్ కెనాల్ ద్వారా నీటికి తరలించుకెళ్లారు.

చాలెంజ్‌గా తీసుకున్న జగన్ ప్రభుత్వం..
తలుపుల మండలంలో ఆగిపోయిన హంద్రీ–నీవా సొరంగ మార్గం పనులు ఎలాగైనా పూర్తి చేసి కృష్ణా జలాలను మెయిన్ కెనాల్ ద్వారా పారించాలని జగన్ ప్రభుత్వం చాలెంజ్‌గా తీసుకుంది. అనుకున్న ప్రకారం ఆ పనులు పూర్తి చేసింది. ఇటీవల వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బి.ఎస్. మక్బూల్ అహ్మద్ అధికారులతో కలిసి మెయిన్ కెనాల్‌కు నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ మెయిన్ కెనాల్ ద్వారా ప్రవహించే కృష్ణా జలాలతో తలుపుల, ఎన్‌పీ కుంట మండలాల పరిధిలోని అన్ని చెరువులను నింపనున్నారు. ఇప్పటికే పుంగనూరు బ్రాంచ్ కెనాల్ ద్వారా కదిరి రూరల్, నల్లచెరువు, తనకల్లు మండలాల పరిధిలోని చెరువులన్నింటినీ కృష్ణా జలాలతో నింపారు.

గాండ్లపెంటకు రూ.46.14 కోట్లు విడుదల..
ప్రజాసంకల్ప పాదయాత్రలో భాగంగా జగన్ గాండ్లపెంట మీదుగా వెళుతుంటే స్థానిక రైతులు ఆయన్ను కలిసి 'మీరు అధికారంలోకి రాగానే మా మండలానికి కూడా కృష్ణా జలాలు వచ్చేలా చూడండి'అని అడిగారు. 'తప్పకుండా మీ కోరిక నెరవేరుస్తా'అని అప్పట్లో జగన్ హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఈ మధ్యే ఆ మండలానికి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా హంద్రీనీవా జలాలను తీసుకొచ్చారు. ఇందుకు రూ.46.14 కోట్లు విడుదల చేశారు. ఈ నీటితో ఆ మండలంలోని అన్ని చెరువులను నింపనున్నారు. అలాగే తనకల్లు మండలంలో ఉన్న సీజీ ప్రాజెక్టును కూడా కృష్ణా నీటితో నింపేందుకు జగన్ ప్రభుత్వం రూ.2.75 కోట్లు ఇటీవల విడుదల చేసింది. హంద్రీనీవా ద్వారా ప్రవహించే కృష్ణా జలాలతో నియోజకవర్గంలోని అన్ని చెరువులకు త్వరలో జలకళ రానుంది.



నిండుకుండను తలపిస్తున్న చెర్లోపల్లి రిజర్వాయర్

సాగుకు సన్నద్ధమవుతున్నాం



చంద్రబాబు పేరు చెప్పగానే కరువు గుర్తొస్తుంది. ఆయన అధికారంలో ఉన్నన్నాళ్లు కరువే. మా మండలంలో ఇప్పుడు కృష్ణాజలాలు పరుగులు తీస్తుంటే రైతులంతా సంతోషంగా ఉన్నారు. దీంతో రైతుల ఆశలు మళ్లీ చిగురించాయి. అన్నదాతలంతా ఉత్సాహంగా సాగుకు సన్నద్ధమవుతున్నారు.

– బి.చేతురామిరెడ్డి, రైతు, ఉబ్బరవాండ్లపల్లి, తలుపుల మండలం

రుణపడి ఉంటాం



జగన్ మాట ఇస్తే తప్పడు. మాట ప్రకారం గాండ్లపెంటకు కూడా హంద్రీనీవా నీళ్లు తెచ్చేందుకు నిధులు మంజూరు చేశారు. చాలా సంతోషం. రైతులంతా ఆయనకు రుణపడి ఉంటాం. మళ్లీ జగనే రావాలి. అందుకు మేమంతా మద్దతుగా ఉంటాం.

–పి.వెంకటా చలపతి, రైతు, కోటూరు, గాండ్లపెంట మండలం

త్వరలోనే టెండర్లు పిలుస్తాం



గాండ్లపెంటకు హంద్రీనీవా నీటిని తెచ్చేందుకు డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి పంపగానే రూ.46.14 కోట్లు విడుదల చేసింది. త్వరలోనే నిపుణులైన అధికారుల ద్వారా మొత్తం ప్రణాళిక సిద్ధం చేసి టెండర్లు పిలుస్తాం. ఈ పనులు పూర్తయితే కదిరి నియోజకవర్గం మొత్తం సస్యశ్యామలం అవుతుంది. సీజీ ప్రాజెక్టుకు కూడా నిధులు విడుదల య్యాయి.

– సి.అరుణ, ఇరిగేషన్ ఏఈ, కదిరి

ఈసీ నిబంధనల మేరకే ఓటరు జాబితా

హిందూపురం: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకే ఓటరు జాబితా తయారు చేశామని జాయింట్ కలెక్టర్, హిందూపురం ఈఆర్‌ఓ అభిషేక్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన హిందూపురంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఓటరు జాబితా సవరణలో అందిన అభ్యంతరాలు, డబుల్ ఎంట్రీలు, తొలగింపులు ఇతరత్రా అన్నీ పరిగణనలోకి తీసుకుని ఓటరు జాబితా పక్కాగా రూపొందించామన్నారు. రాజకీయ పార్టీల నుంచి వచ్చిన అభ్యంతరాలన్నీ పరిష్కరించామన్నారు. వందశాతం ఓటింగ్ కోసం స్వీప్ ద్వారా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రశాంత ఎన్నికలకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. సదుపాయాలు లేని కారణంగా మున్సిపాల్టీ పరిధిలోని రెండు పోలింగ్ స్టేషన్లు పక్కనే ఉన్న భవనంలోకి మార్చామన్నారు. అలాగే 54 నంబర్ మేళాపురం పోలింగ్ కేంద్రం పేరు తప్పుగా నమోదు కావడంతో దాన్ని మార్చామన్నారు. సమావేశంలో తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, సీనియర్ శ్రీనివాసరెడ్డి, రెడ్డిశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు శిక్షణ..
అనంతరం సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొననున్న బీఎల్‌ఓలు, సెక్టార్ ఆఫీసర్లకు అధికారులు శిక్షణ ఇచ్చారు. ఎన్నికలకు వినియోగించే ఈవీఎం పనితీరు, వాటిని ఓపెన్ చేయడం, ఓట్ల నమోదు తర్వాత భద్రపర్చడంపై తదితర అంశాలపై శిక్షకులు ఇస్మాయిల్, సురేష్, సునీల్ తదితరులు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు బీఎల్‌ఓల సందేహాలను నివృత్తి చేశారు.

క్లుప్తంగా

'పోలీసు స్పందన'కు 22 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 22 వినతులు అందాయి. ఎస్పీ మాధవరెడ్డి స్వయంగా వినతులు స్వీకరించి, సమస్య తీవ్రతను అడిగి తెలుసుకున్నారు. చట్టపరిధిలోని సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో దిశ డీఎస్పీ శ్రీనివాసరావు, డీసీఆర్బీ సీఐ శ్రీహర్ష, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి పాల్గొన్నారు.

22 బాక్సుల కర్ణాటక మద్యం పట్టివేత

కదిరి టౌన్: భారీగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటక ప్రాంతం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లుగా సమాచారం అందుకున్న పోలీసులు హిందూపురం రోడ్డులో సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన ఓ కారును ఆపి తనిఖీ చేయగా 22 బాక్సుల్లో తరలిస్తున్న 2,112 టెట్రా ప్యాకెట్ల మద్యం పట్టుబడింది. మద్యం తరలిస్తున్న కదిరిలోని గాంధీనగర్‌కు చెందిన పాలగిరి నౌషాద్‌ను అరెస్ట్ చేశారు. చిక్కబళ్లాపురం నుంచి మద్యం తరలిస్తున్నట్లుగా విచారణలో తేలింది. నిందితుడిపై కేసు నమోదు చేసి, న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ బాబ్జాన్ తెలిపారు.

శిల్పకళల కాణాచి లేపాక్షి



స్తంభంలో వెలసిన దుర్గాదేవి



ఏడుశిరస్సుల నాగేంద్రుని విగ్రహం



ప్రసిద్ధిగాంచిన నంది విగ్రహం

- అరుదైన చారిత్రక సంపదకు నిలయం
- ఈ నెల 7 నుంచి బ్రహ్మోత్సవాలు
- దేశవిదేశీ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్న ఆలయంలోని వింతలు

లేపాక్షి: అరుదైన శిల్పకళలకు కాణాచి... అరుదైన చారిత్రక అద్భుతం... వెయ్యి నోళ్ల పొగడ తరముకాని శిల్పసౌందర్యం... ప్రపంచానికే ఆదర్శమైన ప్రకృతి సంపదగా నిలిచిన లేపాక్షి... మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకూ పురాతన దుర్గావీరభద్రస్వామి ఆలయంలో ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

15వ శతాబ్దం నాటి అరుదైన ఆలయం..

దక్షిణ భారత సువర్ణ యుగంగా భావించే విజయనగర రాజుల కాలంలో నిర్మించిన సుందర దేవాలయాలలో లేపాక్షి ఆలయం ఒకటి. లేపాక్షి ఓ కుగ్రామమే అయినా ఇక్కడున్న ప్రాచీన దేవాలయం వల్ల నేడు ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. విజయనగర రాజు శ్రీకృష్ణ దేవరాయల పరిపాలనా కాలంలో పెనుకొండ ప్రాంతానికి సామంత రాజుగా ఉన్న విరూపన్న, వీరన్న అనే సోదరులు తమ కులదైవం వీరభద్రుని పేర 15వ శతాబ్దంలో ఈ ఆలయాన్ని నిర్మించినట్లు ఇక్కడి శాసనాల ద్వారా తెలుస్తోంది. ఎంతో నైపుణ్యమున్న శిల్పులు చెక్కిన శిల్పాల్లో జీవం ఉట్టిపడుతుండడం ఇక్కడి ప్రత్యేకత

ఆలయంలో అబ్బుర పరిచే అంశాలెన్నో..

- లేపాక్షి ఆలయంలోని ఎన్నో వింతలు దేశవిదేశీ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి.
- మొత్తం 70 స్తంభాలతో నిర్మించిన ఈ ఆలయంలో ఒక్క స్తంభం మాత్రం గాలిలో వేలాడుతున్నట్టుగా ఉంటుంది. ఈ స్తంభం కింది భాగం నుంచి ఓ వస్త్రాన్ని ఒకవైపు నుంచి మరోవైపునకు లాగేవచ్చు. ఏ కారణంచేతనైనా మంటపం కూలిపోయే పరిస్థితి వస్తే ఈ వేలాడే స్తంభం కిందకు ఆనుకుని ఏ ఒక్క స్తంభం పడిపోకుండా అన్ని స్తంభాలను కట్టడి చేస్తుందని చరిత్రకారులు చెబుతున్నారు.
- ఆలయ మొదటి ప్రాంగణాన్ని అందమైన చతురస్రాకారపు మంటపంగా నిర్మించారు. ప్రకృతి మలచిన నీటికొలను గర్భాలయానికి పడమటి దిశలో ఉంది. రెండవ ప్రాంగణపు వెలుపలి గోడపై అసంఖ్యాక శాసనాలు కన్నడ భాషలో చెక్కి ఉన్నాయి. ఈ ప్రాంగణంలోనే అయిదు మీటర్ల ఎత్తున ఉన్న నాగలింగేశ్వర శిల్పం చూపరులను అబ్బుర పరుస్తుంది.
- రెండవ మహాద్వారం దాటితే నాట్య మంటపం ఉంటుంది. ఎనిమిది జతల ఉత్తమాశ్వాలు కట్టిన రథంలా దీనిని తీర్చిదిద్దారు. పరమేశ్వరుని నర్తన మందిరంగా దీనిని పిలుస్తుంటారు. ఇక్కడ భిన్న ముఖాల శిల్పాలతో కూడిన 70 స్తంభాలు ఉన్నాయి. ఈ మంటపం పైకప్పులో అమర్చిన శత పత్ర కమలం ప్రత్యేక ఆకర్షణగా మారింది. నాట్యాచారుడైన భ్రుంగీశ్వరుని పర్యవేక్షణలో రంభ, ఊర్వశిల నాట్యం, తాళాలు చేత పట్టిన దత్తాత్రేయుడు, పరమశివుని తాండవ నృత్యం, నాట్యాన్ని వీక్షిస్తున్న పార్వతి, సేవానిరతులైన చెలికత్తెలు, సూర్యుని నాదస్వరం, తుంబురాన్ని చేత పట్టిన కిన్నెర, నందీశ్వరుడు మృదంగం, విశ్వబ్రహ్మ మద్దెల, వీణా మృదంగధారులైన సరస్వతి, బ్రహ్మదేవుడి ఆసక్తికరమైన శిల్పాలు, యాచకుడిగా పరమేశ్వరుని శిల్పం చాలా ఆకర్షణీయంగా ఉన్నాయి. నాట్య మంటపంపై పైకప్పులో అసంఖ్యాక తైలవర్ణ చిత్రాలు ఉన్నాయి. భారత, రామాయణ, శివపురాణాల్లో ప్రముఖ ఘట్టాల్ని కథా రూపంగా ఇక్కడ చిత్రీకరించారు.
- నలభై ఒక్క స్తంభాలతో అలరారే పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మంటపం గర్భగుడికి పడమరన ఉంది. ఆంజనేయ మంటపం ఎదురుగా ఉన్న బండపై సదా నీరు ప్రవహించే పాదముద్ర ఉంది. మండు వేసవిలోనూ పాదముద్రలో నీరు ప్రవహిస్తూ ఉండడం ఇక్కడి విశేషం.
- లేపాక్షిలో మహానంది నిర్మాణ ఇతిహాసం చాలా ఆసక్తికరంగా ఉంది. ఒకప్పుడు కూలి విషయంగా తలెత్తిన వివాదం కారణంగా శిల్పులందరూ మూకుమ్మడిగా చెక్కడం ఆపి సమ్మె చేస్తూ కాలాన్ని వృథా చేయడం ఇష్టం లేక ఆలయానికి తూర్పు దిశలో భువి నుంచి మొలకెత్తిన భారీశిలకు నంది రూపాన్ని ఇచ్చారని చరిత్ర కారులు చెబుతున్నారు. 5 మీటర్ల ఎత్తు, 9.5 మీటర్ల పొడవున్న ఈ మహానంది సౌందర్యం వర్ణనాతీతం.

11వ తేదీ వరకూ శివరాత్రి ఉత్సవాలు..

ప్రపంచ పర్యాటక కేంద్రమైన లేపాక్షి ఆలయంలో ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకూ మహాశివరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయం ఈఓ నరసింహమూర్తి తెలిపారు. ఏటా మహాశివరాత్రిని పురస్కరించుకుని వీరభద్రస్వామి రథోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు.

కూలీల దుర్మరణం



జగన్నాథ్, ముత్యాలు మృతదేహాలు

కనగానపల్లి: వేరుశనగ నూర్పిడి యంత్రం బోల్తాపడిన ఘటనలో ఇద్దరు కూలీలు దుర్మరణం పాలయ్యారు. పోలీసులు తెలిపిన మేరకు... కనగానపల్లి మండలం ముత్తువకుంట్ల గ్రామానికి చెందిన కూలీలు జగన్నాథ్ (50), ముత్యాలు (35) సోమవారం నెమలివరం గ్రామానికి వేరుశనగ కట్టె ఆడించే పనికి వెళ్లారు. సాయంత్రం పని పూర్తయిన తర్వాత కూలీలతో కలసి ట్రాక్టర్‌కు అమర్చిన నూర్పిడి యంత్రంపై కూర్చొని తిరుగు ప్రయాణమయ్యారు. కొద్ది దూరం వెళ్లగానే ట్రాక్టర్‌కు ఉన్న హుక్కు జారీపోవడంతో నూర్పిడి యంత్రం బోల్తాపడింది. దీంతో దానిపై కూర్చొన్న నలుగురు కూలీలు కింద పడ్డారు. తీవ్రంగా గాయపడిన జగన్నాథ్, ముత్యాలు అక్కడికక్కడే మృతి చెందారు. స్వల్పంగా గాయపడిన ఇద్దరు కూలీలను అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ మల్లికార్జున రెడ్డి తెలిపారు.

విషపు నీరు తాగి 14 మేకలు మృతి



మృతి చెందిన మేకలను చూపుతున్న బాధితుడు

ముదిగుబ్బ: విషపూరిత నీరు తాగి ముదిగుబ్బ మండలం బ్రహ్మదేవరపల్లిలో కాపరి గంగప్పకు చెందిన 14 మేకలు మృతిచెందాయి. సోమవారం తన మేకలను మేపునకు గ్రామ శివారులోని పొలాల్లోకి కాపరి తోలుకెళ్లాడు. మధ్యాహ్నం పంటకు పిచికారీ చేసేందుకు క్రిమి సంహారక మందు కలిపిన నీటిని ప్రమాదవశాత్తు మేకలు తాగి మృతి చెందాయి. దీంతో రూ.1.50 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత కాపరి వాపోయాడు.

పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

చిలమత్తూరు: స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన యువకుడు రాజుపై పోక్సో కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ గంగాధర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. చిలమత్తూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలికను మోసం చేసి గర్భవతిని చేశాడంటూ బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు రాజుపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

వ్యక్తి దుర్మరణం



వెంకటరమణ (ఫైల్)

తనకల్లు: లారీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... తనకల్లు మండలం బూడిదగడ్డకు చెందిన వెంకటరమణ (38)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎద్దుల బండి ద్వారా ఇసుక తరలిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం పాపాగ్ని నదిలో నుంచి ఇసుక తీసుకువచ్చేందుకు ఎద్దులబండి తీసుకుని బయలుదేరాడు. మండ్లిపల్లి మిట్ట సమీపంలోకి చేరుకోగానే వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన లారీ ఢీకొంది. ఘటనలో ఎద్దులబండిపై ఉన్న వెంకటరమణ అక్కడికక్కడే మృతి చెందాడు. ఓ ఎద్దు కూడా ప్రాణాలు కోల్పోయింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గంజాయి విక్రేత అరెస్టు

గుత్తి: స్థానిక రైల్వేస్టేషన్ పరిధిలోని పత్తికొండ రోడ్డు బ్రిడ్జి వద్ద గంజాయి విక్రయిస్తూ గుత్తి మండలం టి. కొత్తపల్లికి చెందిన బొంబాయి నరేష్ పోలీసులకు పట్టుబడ్డాడు. సోమవారం ఇన్‌చార్జ్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ నబీరసూల్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో 1,145 గ్రాముల గంజాయితో నరేష్ పట్టుబడ్డాడు.

సచివాలయ కార్యదర్శులకు అధికారాలు

పుట్టపర్తి అర్బన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సచివాలయ ఉద్యోగుల్లో పలువురు కార్యదర్శులకు సర్వాధికారాలు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సుమారు నాలుగు ఏళ్లుగా సచివాలయాల్లో పని చేస్తున్న సెక్రెటరీలు గ్రేడ్-5 సెక్రెటరీలుగా ఎలాంటి అధికారాలు లేకుండా ఇంత కాలం విధులు నిర్వర్తిస్తూ వచ్చారు. ఉద్యోగంలో చేరినప్పుడు రూ.15 వేలు గౌరవ వేతనాన్ని ప్రభుత్వం చెల్లించగా... రెండేళ్ల తర్వాత సర్వీసును క్రమబద్ధీకరిస్తూ బేసిక్ శాలరీగా రూ.23 వేలు, హెచ్‌ఆర్ఏ, డీఏ కలిపి సుమారు రూ.28 వేలు జీతం చెల్లిస్తూ వస్తోంది. ఇటీవల కార్యదర్శులుగా పని చేస్తున్న వారికి 'ఒక పంచాయతీ-ఒక కార్యదర్శి' పేరుతో జీఓ నెంబర్ 11ను జగన్ సర్కార్ విడుదల చేస్తూ గ్రేడ్-5 కార్యదర్శులకు డ్రాయింగ్ అండ్ డిస్బర్స్‌మెంట్ ఆఫీసర్(డీడీఓ) అధికారాలు కల్పించింది. దీంతో పంచాయతీ కార్యదర్శుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

డీడీఓలుగా 168 మంది..

జిల్లాలో 465 గ్రామ పంచాయతీలుండగా ఇందులో ఇప్పటికే గ్రేడ్-1 నుంచి గ్రేడ్-4 వరకూ పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తున్నారు. గ్రేడ్-5 కార్యదర్శులు 211 మంది ఉన్నారు. వీరిలో 168 మంది కార్యదర్శులకు ఇటీవల ప్రభుత్వం డీడీఓ అధికారాలు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. డీడీఓ అధికారాలు దక్కడంతో ఉద్యోగోన్నతికి మార్గం ఏర్పడింది. జీఓ 11తో పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీలో తీర్మానాలు చేయడం, బిల్లులు చేయడం, బిల్లులు చెల్లించడం, సర్పంచ్‌తో కలిసి చెక్ పవర్ కలిగి ఉండడం, ఏవైనా వర్క్‌లు జరిగితే బిల్లులు చేసే అధికారం కలిగి ఉండడం, సర్పంచ్‌తో కలిసి సంతలు వేలం వేయడం తదితర అధికారాలు ఉంటాయి.



సచివాలయ భవనం

చాలా సంతోషంగా ఉంది



గ్రేడ్-5 కార్యదర్శులకు డీడీఓ అధికారాలు ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. ఇందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాం. యువతకు వేలాది ఉద్యోగాలు కల్పించారు. సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉన్నాము

– ఓంప్రసాద్, కార్యదర్శి, గంగిరెడ్డిపల్లి, పుట్టపర్తి మండలం

అన్ని అధికారాలూ ఉంటాయి



ఇకపై గ్రేడ్-5 కార్యదర్శులకు సైతం ఆయా పంచాయతీల్లో అన్ని అధికారాలు ఉంటాయి. సర్పంచ్‌తో కలసి చెక్‌పవర్, బిల్లులు క్రియేట్ చేయడం, చెల్లించడం, అన్ని పనులు చేయవచ్చు. పంచాయతీల అభివృద్ధిలో వీరంతా భాగస్వాములు కానున్నారు.

– విజయ్‌కుమార్, డీపీఓ

అట్టహాసంగా బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

- ధ్వజారోహణతో ప్రారంభమైన బుగ్గరామలింగేశ్వర స్వామి ఉత్సవాలు
- సకల దేవతలను ఆహ్వానిస్తూ హోమం



ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు



యాగశాలలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

తాడిపత్రి అర్బన్: స్థానిక బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ధ్వజారోహణతో మంత్రపూరిత ధ్వజపటం ఎగురవేసి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. అనంతరం ఉత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాన్ని నిర్వహించారు. పుణ్యాహవాచనం, శివ సంకల్పం, చండీశ్వర పూజ. రుత్విగ్వరణం, అఖండ స్థాపన, వాస్తుపూజ, వాస్తుహోమం, పంచావరణార్చన, వండపారాధన, కలశస్థాపన తదితర ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖరశర్మ పర్యవేక్షించారు. కార్యక్రమంలో శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, ఉభయదారులు పాల్గొన్నారు.

అక్రమాల 'పల్లె'పై చర్యలు తీసుకోండి

- జేసీ కేతన్‌గార్గ్‌కు రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహమ్మద్ ఫిర్యాదు



జేసీ కేతన్‌గార్గ్‌కు ఫిర్యాదు చేస్తున్న రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహమ్మద్

అనంతపురం అర్బన్: కోర్టు కేసులో ఉన్న భూమిని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి కొనుగోలు చేయడమే కాక, అందులో ఎలాంటి అనుమతుల్లేకుండా నిర్మాణాలు చేపట్టారని, అక్రమాలకు తెరదీసిన పల్లెపై చర్యలు తీసుకోవాలంటూ అనంతపురం జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌కు రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహమ్మద్, కె.ఎండీ.జకియా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జేసీని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నగర శివారులోని ఆలమూరు గ్రామంలో 200 ఎకరాల భూమికి సంబంధించి పార్టీషన్ సూటు (ఓఎస్ నెంబరు 20/2015) వివాదం అనంతపురం ఒకటవ అడిషనల్ జడ్జి కోర్టులో నడుస్తోందన్నారు. ఈ వివాదం ఎటూ తేలకుండానే 2016లో ఆ భూమిని కొనుగోలు చేసి, ఎలాంటి అనుమతుల్లేకుండా కట్టడాలు నిర్మించారన్నారు. ప్రస్తుతం అక్కడ వ్యవసాయ కళాశాలను నిర్వహిస్తున్నారని వివరించారు. అంతే కాక రైతుల కోసం ప్రభుత్వ భూమిలో నిర్మించిన చెక్‌డ్యామ్‌ను ఆక్రమించి పూడ్చి వేయిస్తున్నారన్నారు. వీటన్నింటిపై సమగ్ర విచారణ చేపట్టి అక్రమ కట్టడాలను తొలగించాలని, చెక్‌డ్యామ్‌ను పూడ్చివేయించినందుకు పల్లెపై కేసు నమోదు చేయాలని కోరారు.

ఇంటింటా సోలార్ వెలుగులు

- సర్కారు సరికొత్త పథకం
- ప్రతి ఇంటికీ 300 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్
- ఆసక్తి ఉన్న ఇంటి యజమానుల నుంచి దరఖాస్తుల స్వీకరణ



అనంతపురం సిటీ: సౌరశక్తితో ఇంటింటా వెలుగులు నిండనున్నాయి. ఉచిత విద్యుత్‌తో ప్రతి ఇల్లూ దేదీప్యమానంగా కాంతులీననుంది. ఇందుకు కేంద్ర ప్రభుత్వం సరికొత్త పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రతి ఇంటికీ సోలార్ ప్లేట్లను సరఫరా చేయడం ద్వారా 300 యూనిట్ల వరకూ ఉచిత కరెంట్ పొందే అవకాశం కల్పించనుంది. కేంద్ర ప్రభుత్వ ఈ పథకంపై తపాలా శాఖ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించనున్నట్లు ఆ శాఖ పీఆర్ఓ ప్రమోద్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు..

సౌరశక్తిని ఉపయోగించి విద్యుత్ బిల్లులు ఆదా చేయాలనుకునే వారు కేంద్ర ప్రభుత్వ పథకాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. తమకు దగ్గరలోని పోస్టాఫీసులకు వెళ్లి పోస్ట్‌మాస్టర్ వద్ద ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలి. 1 కేడబ్ల్యూ పైకప్పునకు సాధారణంగా 8-10 చ.మీ. నీడలేని ప్రాంతం అవసరం. వినియోగదారుడు సెల్‌ఫోన్ కచ్చితంగా కలిగి ఉండాలి. ఇంటికి ఆర్‌సీసీ స్లాబ్ ఉండాలి. తగినంత లోడ్ బేరింగ్ సామర్థ్యం ఉన్న ఏ రకమైన పైకప్పుపై సౌర పీవీ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవచ్చు. ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు '1 కేడబ్ల్యూ' సౌర విద్యుత్ కేంద్రం ఒక రోజులో 4-4.5 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. పైకప్పుపై అమర్చిన సోలార్ ప్యానల్ ప్రామాణిక జీవిత కాలం 25 ఏళ్ల పాటు ఉంటుంది. సౌర విద్యుత్ ప్యానల్ కొనుగోలు విషయంలో డిస్కం నిర్ణయించిన ధరల ప్రకారం ముందుగానే వినియోగదారులు చెల్లించాల్సి ఉంటుంది.

సౌరశక్తికి సబ్సిడీ ఇలా...

యూనిట్లు	సామర్థ్యం	అంచనా మొత్తం	సబ్సిడీ
0 - 150	1 - 2 కేడబ్ల్యూ	రూ.55 వేలు నుంచి రూ.65 వేలు	రూ.30 వేల నుంచి రూ.60 వేలు
150 - 300	2 - 3 కేడబ్ల్యూ	రూ.లక్ష నుంచి రూ.1.15 లక్షలు	రూ.60 వేల నుంచి రూ.78 వేలు
300 - ఆపైన		రూ.1.40 లక్షల నుంచి రూ.4.60 లక్షలు	రూ.78 వేలు

80 వానరాల అనుమానాస్పద మృతి



కోతుల కళేబరాలు

రొద్దం: మండల పరిధిలోని చోళేమర్రి గ్రామ సమీపంలో సుమారు 80 వానరాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాయి. గ్రామ సమీపంలోని కాలనీ వద్ద వానర కళేబరాలను గుట్టగా పడేసి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ ప్రాంతం కానందున మీరే ఖననం చేసేయాలని సూచించారు. దీంతో కాలనీ వాసులు జేసీబీతో గుంత తీయించి వానర కళేబరాలను ఖననం చేశారు. సమీపంలోనే బిహార్, రాజస్థాన్, బెంగళూరు వాసుల వ్యవసాయ క్షేత్రాలు ఉన్నాయి. ఆయా క్షేత్రాల సిబ్బంది పంటలను రక్షించడానికి కోతులపై విష ప్రయోగం చేసి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.